# ముందు చూపు......

రచన :
శ్రీ బమ్ముపీర్రాజు

అప్పుడే తెల్లవారింది-

వూళ్లోని రత్తాలు ‘కాఫీ హోటల్’ కళ, కళలాడుతోంది.

ఓ చేతిలో కర్రతో, మరో చేతలో చుట్టతో ఆరడుగల విగ్రహమైన రాములు నెమ్మదిగా హోటల్ ముందున్న ఓ బల్లదగ్గరికి చేరాడు.

కొంతసేపటికి సప్లయిర్ బయటకురాగానే, ‘ఒరే అబ్బాయ్! ఓ స్ట్రాంగ్ టీ పట్టుకురా’ అంటూ, చుట్ట నోట్లో పెట్టుకొని, రోడ్ మీదకు చూపు మళ్ళించాడు.

యింతలో యిద్దరు కాలేజీ కుర్రాళ్ళు, ఈలలు వేసుకొంటూ, హోటల్ ముందున్న మరో బల్ల దగ్గరకు చేరారు.

సప్లయిర్ అందించిన ‘టీ గ్లాసు’ అందుకొని నెమ్మదిగా టీ చప్పరిస్తూ, ఆ కుర్రాళ్ళవంక చూశాడు రాములు.

ఓ కుర్రవాడి చేతిలో ‘న్యూస్ పేపర్’ వుంది. రెండో కుర్రవాడు సప్లయిర్ కి టిఫిన్ గురించి ఆర్డరిస్తుంటే, మొదటి కుర్రవాడు తన చేతిలోని పేపర్ మడత విప్పి చూడసాగాడు.

‘ఒరేయ్! యిది విన్నావా?’ అంటూ ప్రశ్నించాడు పేపర్ చదువుతున్న కుర్రాడు రెండో కుర్రాడిని.

‘ఏమిట్రా అది? చెప్పు’ ఆత్రుతగా అడిగాడు రెండో కుర్రాడు.

దానికి మొదటి కుర్రాడు యిలా చదివాడు-

‘సినీ నిర్మాత ఆత్మహత్య’ - తనకున్న ఆస్థి పాస్తులను తెగనమ్ముకొని, సినిమా వ్యామోహంతో మద్రాసు చేరిన ఓ నిర్మాత ఈ రోజు దుర్మరణం చెందినట్లు వార్త అందినది. మించినంటే తారల పారితోషికాలకు తట్టుకొని చిత్ర నిర్మాణం మొదలెట్టిన ఈ నిర్మాత, చిత్రంలో ముఖ్య పాత్ర ధరించే ఓ నటుని హఠాన్మరణం, ముందే పారితోషికం గుంజుకొన్న ఓ తారగారి పలాయనం, లక్షరూపాయల సెట్టింగ్ అగ్నిపాలు, సెన్సార్ వారి కట్స్ కు రీ షూటింగ్ వగైరా దెబ్బలకు తట్టుకోలేక ఆ నిర్మాత ఆత్మహత్య చేసుకొన్నట్లుగా నిర్ధారణ చెయ్యబడింది’ ఓసారి ఆగాడు ఆ కుర్రాడు.

‘ఓ మైగాడ్! యింకచాల్లే నేను వినలేను’ అరిచాడు రెండో కుర్రాడు.

యింతలో వాళ్ళు ఆర్డరిచ్చిన టిఫిన్ తెచ్చి, సప్లయిర్ టేబిల్ మీద పెట్టడంతో వాళ్ళిద్దరూ, అవురు, అవురుమంటూ, ఆ ప్లేట్లమీద దాడి చెయ్యడం మొదలు పెట్టారు.

ఆ వార్త విన్న రాములు లేచినిలబడి ‘దీనిసిగ తరగ ఏం సినిమాలోకమో!’ అనుకొంటూ, క్యాషియర్ వైపు దారితీసాడు.

బిల్లు చెల్లించి, వూరిబయట వున్న పొలాల వైపుకు నడవసాగాడు.

◆ ◆ ◆

వూరి బయటకు చేరి, రోడ్ దాటబోతున్న రాములు, దూరంలో కారు హారన్ వినిపించేసరికి, రోడ్ క్రాస్ చెయ్యకుండ నిలబడి పోయాడు.

కొన్ని క్షణాల్లో, ఓ చిన్న కారు వచ్చి ఆగింది రాములు ముందు.

అందుకొంటి, ఖరీదైన బట్టలు ధరించిన ఓ పెద్దమనిషి దిగి దిగగానే-

పెద్దమనిషి నెమ్మదిగా రాముల్ని సమీపించి భుజం మీద చెయ్యివేశాడు,

రాములు ఆశ్చర్యపోతూ, అతనివంక ఎగా. దిగా చూడసాగాడు.

'చూడయ్యా! కంగారుపడకు. ఈ పది రూపాయలూ వుంచుకో, కాస్త నా సందేహాలు మాత్రం తీర్చు' ఆ పెద్దమనిషి అభ్యర్థనగా రాములు వంక చూశాడు

రాములు ఆశగా అనోటందుకొని 'ఏటయ్యా! మీ సందేహం?' నానుస్తూ అడిగాడు.

'ఈ వూళ్ళో మొత్తం ఎన్ని గడపలుంటాయ్?'

'సుమారు మూడువందల గడపవుంది బాబయ్యా!'

'బాగా డబ్బున్న వాళ్ళు వున్నారా?'

'చిత్తం! వున్నారు'

'ఏ వీధిలో డబ్బెక్కువ గలవాళ్ళున్నారు?'

'రాజవీధిలోనే వున్నారండి'

'వాళ్ళల్లో ధర్మగుణం వుందా?'

'దానాలకూ, ధర్మాలకూ మావూరు పేరు పడిందయ్యా!'

'ఈవూళ్లో గాలికీ, నీళ్ళకీ కొదవ లేదుగదా!'

'ఎంతమాట! రెండూ ధారాళంగానే వుంటాయి'

'ఈవూళ్ళో గుడి ఏమైనా వుందా?'

'చిత్తం! వుందండి'

'ఏం గుడి?'

'ఆంజనేయస్వామి వారి గుడి బాబయ్యా?'

'జనం బాగావస్తారా?'

'చిత్తం! రోజూ కన్నులపండుగగా వుంటదండి'

గుళ్ళో స్వామివారి ప్రసాదం పెడతారా?'

'ఎంతమాట? రోజూ పెడతారండి'

'ఏమిటి?'




జుపిటర్ వారి అత్యుత్తమమైన తయారీంపులు!

• జుపిటర్ ఫైన్ • వెస్టన్ • షోర్
• కూల్ టెక్స్ • విజయ్ • కాస్మో

మీరు బనియన్లు కొనే ముందు "జూపిటర్" మార్కు వున్నదా అని చూచి కొనండి.

హైదరాబాదు _ సికిందరాబాదు మినహా అన్ని చోట్లలో ఏజెంట్లు కావలెను.

...............: తయారించువారు :...............

Grams: JUPITER Phone: 20670

Jupiter Knitting Company

Lakshminagar Main Road,

TIRUPUR - 638 602.

'చక్కెరపొంగలి'

'రోజూ అదేనా?'

'లేదండి! ఒక్కొక్క రోజు పులిహోర పెడతారండి'

'రుచిగా చేస్తారా?'

'చాలా బాగుంటాయండి' ఓసారి అవమానంగా చూసాడు రాములు.

అది గుర్తించిన పెద్దమనిషి జేబులోంచి, మరో నోటును లాగి, అతని చేతిలో నొక్కాడు.

తిరిగి వినమ్రంగా నిలబడ్డాడు రాములు. పెద్దమనిషి మళ్ళీ కంఠం సర్దుకొన్నాడు.

'అయితే ప్రసాదం అందరికీ పెడతారా?'

'చిత్తం! బీదా - బిక్కీ అన్నది లేకుండా పెడ్తారండి'

'ముష్టివాళ్ళకి యిక్కడ ఎక్కువగా ఏం దానం చేస్తారు?'

'కొంతమంది డబ్బులండి, కొంతమంది బియ్యం అండి'

'అన్నం - పప్పూ' ఎవరూ పెట్టరా?'

'అదేం లేదండి. ఆసామిని బట్టి పెడతారండి'

'ఈవూళ్ళో ముష్టివాళ్ళ బియ్యం ఎవరు కొంటారు?'

'గురవయ్య శెట్టి అని ఓ షావుకారున్నాడండి'

'సరియైన ధరకే కొంటాడా?'

'చిత్తం! బియ్యాన్ని బట్టి కొంటాడండి'

'ఈవూళ్ళో ముష్టివాళ్ళు ఎక్కడ తలదాచుకొంటారు?'

'తూర్పు దిక్కున ఓ పాడుబడ్డ గుడి వుందండి'

'అక్కడా! అక్కడ నీళ్ళు దొరుకుతాయా?'

'చిత్తం! ప్రక్కనే కోనేరండి' తిరిగి అవమానంగా ముఖం పెట్టాడు రాములు.

వెంటనే ఆపెద్దమనిషి మరోనోటు లాగి, రాములు చేతికందించాడు.

తిరిగి చేతులు జోడించుకొని నిలబడ్డాడు రాములు.

పెద్దమనిషి అటూ, ఇటూ చూసి, రాముల్ని మరింత దగ్గరకు తీసుకొన్నాడు.

'నీపేరేమిటన్నావ్?' పెద్దమనిషి ప్రశ్నించాడు తిరిగి

'రాములండి' వినయంగా జవాబిచ్చాడు రాములు'

'ఈ కనబడే స్థలం ఎవరిది?'

'ఎవరిదీ కాదండి. పోరంబోకు స్థలమండి'

'యిక్కడ ఎవరైనా గుడిసె వేసుకోవచ్చా?'

'చిత్తం! వేసుకోచ్చండి'

'గుడిసెకు ఎంత ఖర్చవుతుంది?'

'ఓ మాదిరి గుడిసెకు, ఓ వందరూపాయలవ్వొచ్చండి'

'అయితే నాకు నువ్వోపని చేసిపెట్టగలవా?'

'ఏంటండి!'

'యిదిగో! ఈవంద తీసుకొని ఈస్థలంలో ఓ గుడిసె వేయించు'

'చిత్తం! రేపు మాపటికే వేయించేస్తానండి'

'శెహభాష్! అందులో ఓ చాప కూడా వుంచు'

'చిత్తం! యింకేంటండి?

'ఓ చిప్ప - కర్రా కూడా కొనివుంచు, యివి చాలా ముఖ్యం'

'అయ్యా! నేను తేలీ కడుగుతా. నన్ను గంటనుంచీ ఊదరగొట్టేస్తున్నారు. అసలు మీ రెవరు! ఈ గుడిసే, చిప్పా క్రా వగైరాలతో మీకు పనేంటి?' ఉత్సాహంగా అడిగాడు రాములు.

దానికి ఆ పెద్ద మనిషి 'చూడు రాములూ! ఈ రోజే నేను భారీ ఎత్తున నిర్మించిన చిత్రం రిలీజ్ అవ్వబోతోంది. ఈ వూరి పచ్చదనం, వాతావరణం చూస్తే, నాకు భవిష్యత్తులో ఈ వూరే నాకు తగిన చోటుగా నిర్ణయించుకొన్నాను. నేను చెప్పినట్లు చెయ్యి వస్తా' అంటూ వడివడిగా కారువైపుకు నడిచి వెళ్ళిపోయాడు.

అంతే! ఒక్కసారిగా బిగుసుకుపోయి దబ్బున క్రింద కూల పడ్డాడు రాములు.

దుమ్ము రేపుకుంటూ, ఆ కారు పట్నం వైపుకు దారి తీసింది.


## కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 12-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారలుగా చేరండి.

అన్ని హిగ్గిన్‌బాథమ్స బుక్‌స్టాల్సులో దొరుకును.

* కథాంజలి *

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 079.


# ఒక అసమర్థుని కథ

రచన : శ్రీ బి. భీమేశ్వరరావు.

★

(గత సంచిక తరువాయి)

వెంకట్రావ్ మానసిక పరిస్థితిని హెడ్‌మాష్టర్ అర్థం చేసుకున్నాడు. చాల ఆందోళన పడ్డాడు. అతని భుజంపై చేయివేసి 'కాస్త రెస్ట్ తీసుకోండి తరువాత ఇంటికి వెల్దురు గాని' అని అన్నాడు. ఏమనుకున్నాడో వెంకట్రావ్ మాష్టారు వెంటనే కుర్చీలో కూర్చున్నాడు. మళ్ళీ ఇద్దరి మధ్య కొంతసేపటి వరకు మౌనం. 'ఇందాక కోపంలో మీపై నోరు చేసుకున్నాను. చాల విచారిస్తున్నాను' అని ఇంకా ఏదో హెడ్‌మాష్టర్ అనేలోగా వెంకట్రావ్ చప్పున కుర్చీ నుంచి లేచిపోయాడు.

'ఏం హెడ్‌మాష్టరయ్యా, ఇందాక పెంకలెగిరేటట్టు తిట్టేవు. ఇప్పుడేమో విచారిస్తున్నానంటావు. నీకు కూడా జాడీకం లాగ రెండు నాలుకలున్నట్లున్నాయి. జాగ్రత్త. మళ్ళీ నాతో మాట్లాడితే ఆ రెండు నాలికలు తెంపేసి అసలు ఏ నాలుకా లేకుండా చేసేయగలను అని విసురుగా గది నుండి బయటపడి స్కూల్ ఆవరణదాటి పోయేడు.

అతని మనస్సంతా చాల చికాగ్గా ఉంది. రోడ్డు మీద నడుస్తూనే ఉన్నాడు. కాళ్ళు పీకుతున్నాయి. జరిగిపోయిన సంఘటనలు ఎంత వద్దనుకున్నా గుర్తుకు వస్తున్నాయి. ఛీ ఏం పని చేశాడు తను. మచ్చలేని సర్వీసు తనది. అయితేనేం విషపుగీతలు పడనే పడ్డాయి. జరిగినదంతా పీడకల అయిపోతే బాగుణ్ణు. తను ఎప్పటివలె మంచి మాష్టారు అయిపోగలడు. రేపటి నుండి కొత్త జీవితం ఆరంభించాలి. అసలు దీని కంతకీ మూలకారణం జాడీకం అప్పు. ఆ అప్పు ఎప్పుడో తీర్చేయడం జరిగింది,